పెండ్లికాని యువతులే జాబ్‌కు అర్హులా?

- ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగ నిబంధనలను తొలగించాలి
- ఫ్యూచర్‌సిటీలో 100 ఎకరాల భూమిని మహిళా సంఘాలకు కేటాయించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవతో తెలంగాణకు వచ్చిన ఫాక్స్‌కాన్ కంపెనీలో ప్రస్తుతం 18-20 ఏండ్ల లోపు వయసున్న, పెండ్లికాని యువతులే ఉద్యోగానికి అర్హులనే నిబంధన విధించిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆ నిబంధనను తొలగించేలా చొరవ చూపాలని ప్రభుత్వానికి సూచించారు. అసెంబ్లీలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో మహిళా ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌కు సంబంధించి పలు ప్రశ్నలను ఆమె లేవనెత్తారు. ఫాక్స్‌కాన్ కంపెనీ కేవలం పెండ్లికాని మహిళలకే అవకాశం కల్పిస్తున్నదని తెలిపారు. దీంతో కంపెనీ చుట్టుపక్కల నివాసముంటున్న, ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు చేయాలని ఆసక్తి ఉన్న వివాహిత మహిళలకు నిరాశే ఎదురవుతున్నదని తెలిపారు. 14 వేల ఎకరాల్లో ఏర్పాటుచేస్తున్న ఫ్యూచర్ సిటీలో మహిళలకు 100 ఎకరాలు కేటాయించాలని, డ్వాక్రా మహిళలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట, సిరిసిల్ల అన్నితీర్ల డెవలపైంది

ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎలాంటి వివక్ష చూపకుండా అన్ని నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న బీఆర్ఎస్ సభ్యుల కోరిక మేరకు మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సిద్దిపేట, సిరిసిల్ల, ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గాలు అన్ని తీర్ల అభివృద్ధి అయ్యాయని వివరించారు. అవసరాన్ని బట్టి అక్కడ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతిపాదనలను పెడితే పరిశీలిస్తామని చెప్పారు.

ఆంక్షలుంటే చర్యలు తీసుకుంటం: శ్రీధర్‌బాబు

ఫాక్స్‌కాన్ కంపెనీలో పెండ్లికాని యువతులనే తీసుకోవాలనే నిబంధన లేదని, ఒకవేళ ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సభలో సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, తోల లక్ష్మీకాంతం, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రామచంద్రనాయక్ లేవనెత్తిన వివిధ ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. మహిళా ఆంత్రపెన్యూర్లకు, ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీల గురించి వివరించారు. 880 ఎకరాల్లో 1,02,703 మొబిలిటీ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసి 4 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రణాళికలను సిద్ధంచేశామన్నారు.

బాలకృష్ణ కంటే నాకే ఫ్యాన్స్ ఎక్కువ!

- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): సినీ నటుడు, అనంతపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కంటే తనతోనే ఎక్కువమంది ఫొటోలు దిగుతారంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన అసెంబ్లీ హాల్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో బాలకృష్ణపై వివాదాస్పద ఆరోపణలు చేశారు. 'బాలకృష్ణ రోజుకొకరిని కొడతరంట కదా? అట్లాంటప్పుడు ఆయన సినిమాలు ఎవరు చూస్తరు? అయినా ఆయన సినిమాలకు కలెక్షన్స్ బాగనే వస్తాయట' అని మంత్రి వ్యాఖ్యానించారు. మరోవైపు అసెంబ్లీలో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపైనా విమర్శలు చేశారు.

'సితార' హీరోలా కాలేజీ యాజమాన్యాలు!

పేరుకే కాలేజీలు.. చేతిలో చిల్లిగవ్వలేదు • కాంగ్రెస్ పాలనలో దారుణ పరిస్థితులు: పల్లా

- మూతబడే స్థితికి చేరిన పలు కళాశాలలు
- గ్రీన్‌చానల్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులివ్వాలి
- సర్కార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా డిమాండ్
- తక్షణమే రూ.2 వేల కోట్లు విడుదల చేయాలి:హరీశ్‌రావు
- విడతలవారీగా ఫీజు బకాయిలు చెల్లిస్తాం: సీతక్క

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): సితార సినిమాలో హీరో శరత్‌బాబు పరిస్థితిలా నేడు రాష్ట్రంలోని కాలేజీ యాజమాన్యాల పరిస్థితి దారుణంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభివర్ణించారు. ఆ సినిమాలో హీరోకు కారు ఉంటుందని, జేబులో మాత్రం ఖర్చుకు రూ.50 కూడా ఉండని దుస్థితిలా.. కాంగ్రెస్ హయాంలో కాలేజీ యాజమాన్యాల పరిస్థితి చేరిందని వివరించారు. అసెంబ్లీలో శనివారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు, సమస్యలను పల్లా లేవనెత్తారు. 2014లో ప్రభుత్వం మారినప్పుడు రూ.1,508 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఆ నిధులను చెల్లించిందని తెలిపారు. ఆ తర్వాత ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో ఎంటీఎఫ్, ఆర్టీఎఫ్ కోసం రూ.2,300 కోట్ల నుంచి రూ.2,500 కోట్లు ఖర్చు చేశారని, మొత్తం పదేండ్లలో రూ.18,900 కోట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం వెచ్చించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.8,000 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయని, వాటిని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితికి చేరాయని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీలు సగానికిపైగా మూతదశకు చేరాయని తెలిపారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి దశల వారీగానైనా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను గ్రీన్‌చానల్ ద్వారా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారు: సీపీఐ, బీజేపీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తుందో స్పష్టం చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, సమస్యలపై వారు మాట్లాడారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని తెలిపారు. మొత్తం బకాయిలను ఈ ఏడాదే క్లియర్ చేయాలని కోరారు.

కాంగ్రెస్ బురదజల్లే యత్నం: హరీశ్‌రావు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,000 కోట్ల బకాయిలు పెట్టి పోయిందని, వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందని ఉదహరించారు. కరోనా, పెద్దనోట్ల రద్దు వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఏడాదికి సగటున రూ.2 వేల కోట్లకు తగ్గకుండా ఫీజులు చెల్లించామని చెప్పారు. ఏటా ప్రణాళికాబద్ధంగా జనవరి, ఫిబ్రవరి, మార్చిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేవాళ్లమని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిధులను విడుదల చేయడం లేదని, ఇప్పటివరకు చెల్లించిన రూ.800 కోట్లు కూడా కేంద్రం నుంచి వచ్చే ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ల నిధులేనని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే రూ.2,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతుభరోసాతోనే చెల్లించకలేక పోతున్నాం: మంత్రి సీతక్క

రైతుభరోసా, రుణమాఫీతో ప్రభుత్వంపై భారం పడిందని, అందుకే బిల్లులను చెల్లించలేకపోతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎమ్మెల్యేలు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క బదులిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కేవలం రూ.5,520.60 కోట్లు మాత్రమేనని తెలిపారు. ఇప్పటివరకు 829.12 కోట్లు చెల్లించామని, 1,200 కోట్ల చెల్లింపునకు టోకెన్లు జారీచేసినా, వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయని తెలిపారు. విడతలవారీగా బిల్లులను చెల్లిస్తామని, విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన తమకు లేదన్నారు. యాజమాన్యాలతో మాట్లాడామని, ఎవరి సర్టిఫికెట్లను ఆపొద్దని స్పష్టంగా చెప్పినట్టు సీతక్క తెలిపారు.

మార్పు లక్ష్యంతో యువవికాసం

- జూన్ 2 నుంచి పత్రాలు
- అధికారులతో సమీక్షలో భట్టి

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువవికాసం పథకం ద్వారా యువత జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసం అధికారులు అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశించారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి యువవికాసంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 5లోగా దరఖాస్తుల స్వీకరణ పూర్తిచేసి, జూన్ 2 నుంచి 9 వరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు.

డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): యువతలో మాదకద్రవ్యాల వ్యసనం వ్యాపిస్తున్నదని మంత్రి సీతక్క తెలిపారు. మాదకద్రవ్యరహిత తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సైదాబాద్‌లోని అబ్జర్వేషన్ హోమ్‌లో డీ అడిక్షన్ సెంటర్‌ను సీతక్క ప్రారంభించారు. ఈ సెంటర్ ప్రత్యేక మానసిక నిపుణుల బృందం ఆధ్వర్యంలో నడుస్తుందని, దీని వార్షిక నిర్వహణకు రూ.13.80 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు.

నీళ్ల కోసం ప్రజల అరిగోస

- సాగు, తాగునీటి సమస్యలు తీవ్రతరం
- ఎక్కడికక్కడే పంటలు ఎండుతున్నయ్
- జీరోఅవర్‌లో అన్నిపార్టీల ఎమ్మెల్యేల గగ్గోలు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాగు, తాగునీటి ఇక్కట్లు ఎక్కువయ్యాయి. కరెంటు కష్టాలకు తోడు.. పంటలు ఎండుతున్నాయి. తాగునీటి కోసం మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లు ఎక్కాల్సిన దుస్థితి వచ్చింది.. అని ప్రజల నీటిగోస వాస్తవ పరిస్థితిని అన్నిపార్టీల ఎమ్మెల్యేలు జీరో అవర్‌లో శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. ఎండకాలమైనా సాగునీటి కాల్వల్లో పూడికతీతలు మొదలు పెట్టాలని ప్రభుత్వానికి విన్నవించారు. కాల్వల్లో పూడికతీయక, సాగునీరు రావడం లేదని, విద్యుత్తు సమస్యతో సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు సభ దృష్టికి తెచ్చారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని కొందరు ఎమ్మెల్యేలు కోరారు. రంజాన్ మాసంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలిగించొద్దని విన్నవించారు. నాణ్యమైన కరెంటు రాక మోటర్లు కాలిపోతున్నాయని అధికారులకు ఫోన్లు చేస్తుంటే బడ్జెట్ లేదని అంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఫ్యూచర్ సిటీకి అన్ని గ్రామాలను తీసుకోండి: సబితా ఇంద్రారెడ్డి

ఫ్యూచర్ సిటీ కోసం ఏడు మండలాల పరిధిలోని అన్ని గ్రామాలను తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఏడు మండలాల్లోని 52 గ్రామాలనే తీసుకుంటామని చెప్పడంతో దీపం చుట్టూ చీకటిలాగా తమ బతుకులు ఆగమైతవుయానని రైతులు, ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఏ ప్రాతిపకదిన ఆ కొన్ని గ్రామాలను తీసుకున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. ఫ్యూచర్ సిటీకి కూడా హెచ్ఎండీఏ విధి విధానాలు ఉండాలని సూచించారు. కొంగరకలాన్ నుంచి 300 ఫీట్ల రోడ్డు అవసరం లేదని, ఇప్పటికే 200 ఫీట్ల రోడ్డు వేశామని, ఉన్నదానిని అభివృద్ధి చేస్తే సరిపోతుందని తెలిపారు. 15వేల ఎకరాలను సేకరించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ప్రజలు భయాందోళనతో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం దగ్గర ఇప్పటికే 14 వేల ఎకరాల భూమి ఉన్నదని, తక్షణం భూసేకరణ ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈదురు గాలులతో చెట్లు కూలి, 100కు పైగా విద్యుత్తు స్తంభాలు నేలకూలాయని తెలిపారు. దీంతో డబ్బా దుకాణాలు గాలికి కొట్టుకుపోయాయని, బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించకపోతే ఎర్రగడ్డలో పడేయండి

'నాది ప్రొటోకాల్ సమస్య. ఏదైనా కార్యక్రమాలకు నేను వెళ్లకముందే నాపై ఓడిన నేత పునాదిరాళ్లు వేస్తున్నారు. కొబ్బరికాయ కొడుతున్నారు' అని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తెలిపారు. అధికారులను అడిగితే రెండుసార్లు ఓడిపోయారు కదా సార్ మీరే ఓపిక చేసుకోండని చెప్తున్నారు. అటువంటప్పుడు ఆ ఓపిక లేని వాళ్లను తీసుకొచ్చి ఎర్రగడ్డ దవాఖానలో వేయండని హెచ్చరించారు. తాము చేయాల్సిన పనులను వాళ్లు చేస్తుంటే తమకు కూడా సీఎం రేవంత్‌రెడ్డిలాగా రక్తం మరుగుతుందని అన్నారు. దీనికి భట్టి విక్రమార్క కలుగజేసుకొని 'సమస్యను సభ దృష్టికి తీసుకురండి. పరిష్కారం తీసుకోండి. మైక్ దొరికింది కదా అని ఆవేశంగా మాట్లాడితే ఎలా? ఎగతాళిగా మాట్లాడుకోవడానికి కాదు వచ్చింది' అని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం కూనంనేని సాంబశివరావు జాబ్ క్యాలెండర్‌లో మీద ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

'క్యాన్సర్' డేంజర్ బెల్స్

- రాష్ట్రంలో ఐదేండ్లలో 10% పెరిగిన కేసులు
- దేశవ్యాప్తంగా 11.55 శాతం పెరుగుదల

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): దేశంలో క్యాన్సర్ మహమ్మారి నానాటికీ విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా గత ఐదేండ్లలో ఈ కేసులు 11.55% పెరిగినట్టు ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్‌సీ) ప్రకటించింది. ఇదే సమయంలో ఈ కేసుల సంఖ్య తెలంగాణలో 10%, ఏపీలో 9% పెరిగినట్టు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 13,92,179 క్యాన్సర్ కేసులు నమోదవగా.. 2024లో అవి 15,33,055కి పెరిగినట్టు తెలిపింది. ఇదే సమయంలో ఈ కేసుల సంఖ్య తెలంగాణలో 47,620 నుంచి 52,334కు, ఏపీలో 70,424 నుంచి 76,708కి పెరిగినట్టు స్పష్టం చేసింది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 22,18,694కు చేరుకుంటుందని అంచనా వేసింది. భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్సీఆర్‌పీ) డాటా ప్రకారం.. దేశవ్యాప్తంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. రూ.2-3 వేల ఖర్చుతో స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించే వీన్నప్పటికీ చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో 40 ఏండ్లు పైబడిన వారంతా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలి..

పొగ తాగడం, మద్యం సేవించడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. అనారోగ్యకరమైన ఆహారం, మానసిక ఒత్తిడి సైతం క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఒకప్పుడు పాశ్చాత్య దేశాల్లో బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదయ్యేవి. మన దేశంలోని ప్రతి 28 మంది మహిళల్లో ఒకరికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకుండా మహిళలంతా వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం, జీవన శైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- డాక్టర్ గీత నాగశ్రీ, ఆంకాలజిస్ట్ (కేర్ హాస్పిటల్)

20 రోజులు కూలి చేస్తేనే ఆత్మీయభరోసా

- రైతు భరోసా వస్తే ఆత్మీయ భరోసా ఇవ్వం
- ఎకరంలోపు ఉన్నవారికి ఆత్మీయ భరోసా ఇవ్వాలన్న డిమాండ్‌ను భవిష్యత్తులో పరిశీలిస్తాం
- అసెంబ్లీలో మంత్రి సీతక్క వెల్లడి
- రాళ్లు, గుట్టలకు రైతుబంధు ఇచ్చి ఉంటే రికవరీ చేయండి: హరీశ్‌రావు సవాల్
- అన్నం పెట్టే రైతుకు రేవంత్ సున్నం
- పాడి కౌశిక్‌రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా వచ్చేవారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టంచేశారు. భూమి లేని వారికి, 20 రోజులు కూలీ పని చేసిన వాళ్లకు మాత్రమే ఆత్మీయ భరోసా ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఎకరం, అరకెరం ఉన్నవాళ్లకు కూడా ఆత్మీయ భరోసా ఇవ్వాలనే డిమాండ్‌పై భవిష్యత్తులో పరిశీలిస్తామని చెప్పారు. ఉపాధి హామీలో రూ.50 వేలు, రూ.లక్ష తీసుకునే వాళ్లు కూడా ఉన్నారని, అలా అని అందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వలేం కదా అని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.60 నుంచి 70 కోట్లు ఇచ్చామని, మిగిలిన టోకెన్లు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఎన్నికల కోడ్‌తో పాటు ఇతర కారణాలతో మిగిలిన వారికి ఇవ్వలేదని చెప్పారు. జూన్‌లో రెండో దశ ఆత్మీయ భరోసా ఇస్తామని తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొదటి దశ పంపిణీని మార్చి 31లోపు పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వడం లేదంటూ శనివారం అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేసిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు.

అన్నం పెట్టే రైతుకు రేవంత్ సున్నం

దేశానికి అన్నం పెట్టిన రైతుకు సున్నం పెట్టిన దౌర్భాగ్య చరిత్ర రేవంత్‌రెడ్డి సర్కారుదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. రైతులకు కేసీఆర్ పాలన స్వర్ణయుగమైతే, కాంగ్రెస్ పాలన సంక్షోభ యుగంలా మారిందని విమర్శించారు. శనివారం అసెంబ్లీలో వ్యవసాయ పద్దుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ తరుపున పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. వ్యవసాయానికి నిరుడు రూ.72,659 కోట్లు ఖర్చు పెట్టినట్టు చెప్పిన సర్కారు.. ఈ బడ్జెట్‌లో రూ.24,439 కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. రైతులకు రూ.50 వేల కోట్ల బడ్జెట్ ఎందుకు తగ్గించారని నిలదీశారు. వరంగల్ డిక్లరేషన్ ఎన్నేండ్లలో పూర్తి చేస్తారో, అందరికీ రుణమాఫీ ఎప్పుడు చేస్తారో, రైతుభరోసా ఎప్పుడు ఇస్తారో, పంటల బీమా ఎప్పుడు అమలు చేస్తారో చెప్పండని ప్రశ్నించారు.

రుణమాఫీ పూర్తయితే.. వీళ్లకు ఎందుకు కాలేదు

25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల మాఫీ చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని, కానీ రాష్ట్రంలో ఇంకా లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదని పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. గత బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.31 వేల కోట్లుగా పేర్కొన్నారని, ఇప్పుడేమో రూ.20,616 కోట్లతో రుణమాఫీ పూర్తి చేశామని చెప్తున్నారని, మిగిలిన రూ.11 వేల కోట్లు ఎటు పోయాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు రెండు విడతల్లో రూ.29,144 కోట్ల రుణమాఫీ చేశామని, ఇది కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ కన్నా ఎక్కువని చెప్పారు.

రైతుభరోసా ఏమైంది?

ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రైతుభరోసా కింద రెండు సీజన్లు బాకీ పడిందని, ఎకరానికి రూ.17,500 బాకీ పడిందని పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. 'చేతులు జోడించి కోరుతున్నా.. రైతులు ఎదరుచూస్తున్నారు. రైతుభరోసా కింద రూ.15వేలు జమ చేయండి' అని విజ్ఞప్తి చేశారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని స్పష్టంచేశారు. 2014-15లో రైతుల తలసారి ఆదాయం రూ.1,12,162 మాత్రమే ఉంటే 2023-24 నాటికి రూ. 3,17,115కు పెరిగిందని, ఇది కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఘనతని స్పష్టం చేశారు. ఇప్పుడు మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయని, యూరియా దొరకడం లేదని, రైతుభరోసా రావడం లేదని దుయ్యబట్టారు. మత్స్యకారులు, యాదవ, కురుమ సోదరులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన ఉచిత చేపల పిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీకి కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెట్టి ఆ వర్గాలకు అన్యాయం చేసిందని విమర్శించారు.

రాళ్లు, గుట్టలకు ఇచ్చి ఉంటే రికవరీ చేయండి: హరీశ్‌రావు

బీఆర్ఎస్ హయాంలో రాళ్లు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారంటూ మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాళ్లు, గుట్టలకు ఇచ్చి ఉంటే, ఆ వివరాలు బయటపెట్టి, రికవరీ చేయాలని సవాల్ చేశారు. ఆత్మీయ భరోసాలో దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. గుంట, రెండు గుంటల భూమి గల రైతులకు రైతుభరోసా ద్వారా రూ.3 వేలు రావడం వల్ల ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు నష్టపోతున్నారని తెలిపారు. ఎకరంలోపు ఉన్న వారందరికీ 12 వేలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మీయ భరోసా కోసం గత బడ్జెట్‌లో రూ.930 కోట్లు పెట్టారని, ఇందులో రూ.60 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు సీతక్క చెప్తున్నారని తెలిపారు. అయితే ఇంకా రూ.870 కోట్లు విడుదల చేయలేదని విమర్శించారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే రాష్ట్రం బాగు

- వైద్యానికి 2% బడ్జెట్ తగదు
- వైద్య, ఆరోగ్యరంగం నిధులు పెంచాలి
- దవాఖానల్లో గతంతో పోల్చితే తగ్గిన చికిత్సలు
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): హెల్త్ పీపుల్స్‌తోనే హెల్త్ రాష్ట్రం సాధ్యమవుతుందని, వైద్య ఆరోగ్యరంగం ప్రాధ్యాన్యాన్ని గుర్తించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. తాజా బడ్జెట్‌లో వైద్యఆరోగ్య రంగానికి కేవలం 2% నిధులే కేటాయించడం తగదని తెలిపారు. అసెంబ్లీలో శనివారం బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వ దవాఖానలో డెలివరీలు 30 శాతమే జరిగేవని, కేసీఆర్ కిట్లు ప్రవేశపెట్టిన తర్వాత డెలివరీలు 70 శాతానికి చేరాయని చెప్పారు. మాతా శిశు మరణాల రేటు నాడు 11.12 నుంచి 3 శాతానికి పడిపోయిందని గుర్తుచేశారు. నాడు వ్యక్తిని యూనిట్‌గా తీసుకొని కేసీఆర్ బడ్జెట్ కేటాయింపులు జరిపారని, తద్వారా సత్ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. వరంగల్ ఎంజీఎం దవాఖాన నిర్మాణం ఆగిపోయిందని, 15 నెలలుగా ఒక్క ఇటుక కూడా కొత్త ప్రభుత్వం పేర్చలేదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో తన ఇంటికి ఎదురుగా ఉన్న మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో ప్రతినెలా 200 డెలివరీలు అయితే, గత నెలలో 50 డెలివరీలే అయ్యాయని గుర్తుచేశారు.

రైతుకు పిల్లనిచ్చే పరిస్థితి లేదు: కాటిపల్లి

వ్యవసాయాన్ని పరిశ్రమగా మార్చి వారికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుకు పిల్లనిచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు ఏమి కావాలో తెలుసుకొని నకిలీ విత్తనాలు అమ్మకుండా సీడ్‌కు ఇన్సూరెన్స